నమస్తే తెలంగాణ

# టీబీజీకేఎస్ నామినేషన్ దాఖలు



సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీకి నామినేషన్ వేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

- **కోర్టు తీర్పు, చట్టాలకు లోబడి ఉంటాం**
- **టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య**

శ్రీరాంపూర్/కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 7: సింగరేణిలో జరుగుతున్న ఏడో దఫా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తూ హైదరాబాద్‌లోని డీవైసీఎల్‌సీ కార్యాలయంలో టీబీజీకేఎస్ శనివారం నామినేషన్ దాఖలు చేసింది. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి డీవైసీఎల్‌సీకి నామినేషన్ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య మాట్లాడుతూ అనేక విధాల కారణాలతో వాయిదా వేస్తూ సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు డీవైసీఎల్‌సీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కోర్టు జోక్యంతో ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. సింగరేణిలో 12 కార్మిక సంఘాలు అసెంబ్లీ ఎన్నికల అనంతరం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేసి డీవైసీఎల్‌సీకి ఇచ్చినప్పటికీ నోటిఫికేషన్ ఏకపక్షంగా జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అయినప్పటికీ డీవైసీఎల్‌సీ ఇచ్చిన నోటిఫికేషన్‌ను గౌరవిస్తూ నామినేషన్ వేశామన్నారు. సింగరేణి యాజమాన్యం హైకోర్టు ఫుల్‌బెంచ్‌లో వేసిన కేసు వాదనలు పూర్తయ్యాయని, ఈ నెల 11న తీర్పు రానున్నాదన్నారు. కోర్టు స్టే ఇవ్వకపోవడం వల్ల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నదని , తాము చట్టాలను గౌరవిస్తూ, డీవైసీఎల్‌సీ నోటిఫికేషన్ మేరకు చివరి రోజు శనివారం తమ యూనియన్ తరపున నామినేషన్ వేశామన్నారు. తీర్పు ఎలా వచ్చినా టీబీజీకేఎస్ ఎన్నికలకు సిద్ధంగా ఉందన్నారు.

**హ్యాట్రిక్ సాధిస్తాం..**

గత తొమ్మిదేళ్లలో సింగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ అన్ని విధాలా ఆర్థిక ప్రయోజనాలు, సౌకర్యాలు, హక్కులు కల్పించారన్నారు. సీఎం కేసీఆర్‌పై కార్మికులకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఎన్నడూ లేని విధంగా కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టారన్నారు. కార్మికులకు రూ. 1750 కోట్ల 11వ వేతన ఏరియర్స్, రూ. 711 కోట్ల సింగరేణి లాభాల వాటా ఇచ్చారన్నారు. ముఖ్యంగా కార్మికుల బిడ్డలు ఆగం కాకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ కారుణ్య ఉద్యోగాలు కల్పించారని, దాంతో 16 వేల మంది కార్మికుల బిడ్డలకు ఉద్యోగాలు లభించాయన్నారు. కొలిండియాలో లేని హక్కులు కల్పిస్తున్న టీబీజీకేఎస్ సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో కార్మికుల కార్మికుల ఆధారభిమానంతో టీబీజీకేఎస్‌ను గెలిపిస్తారని, కేసీఆర్‌కు అండగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.

**జీఎల్‌బీకేఎస్ నాయకులు ..**

గోదావరిఖని, అక్టోబర్ 7: హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్ కుమార్‌కు జీఎల్‌బీకేఎస్ నాయకులు శనివారం నామినేషన్ పత్రం అందించారు. ఈ సందర్భంగా జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.విశ్వనాథ్ మాట్లాడుతూ కార్మిక సంఘాల చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణ చేసే విధంగా ఎన్నికలు ఉండాలన్నారు.

## 52వ జోనల్ రెస్క్యూ పోటీలకు సిద్ధం

- **వివరాలు వెల్లడించిన జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ**




సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 7: సింగరేణి సంస్థ 52వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలకు ఆర్జీ-2 ఏరియాలోని మెయిన్ రెస్క్యూ స్టేషన్‌ను సిద్ధం చేసినట్లు ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లుతో కలిసి స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 10,11 తేదీల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రారంభోత్సవానికి సంస్థ డైరెక్టర్స్ జీ. వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్. బలరాం, ఎన్వీకే శ్రీనివాస్, డీఎంఎస్ అధికారులు హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించనున్న ఈ పోటీలకు అదే స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి రెస్క్యూకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన పనిముట్లను అందుబాటులో ఉంచుతూ టీం సభ్యులకు అత్యున్నతమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో సింగరేణి వ్యాప్తంగా ఆరు జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నట్లు వెల్లడించారు. ఫస్ట్ ఎయిడ్, థియరీ, రెస్క్యూ, రెస్క్యూ రికవరీ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారిగా గనిలో ప్రమాదం జరిగినప్పుడు రెస్క్యూ సభ్యులు చేపట్టే ఆపరేషన్ 7ఎల్ఈపీ గనిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**ఈ పోటీల్లో పాల్గొనే జట్లు..**

ఆర్జీ-1, 2, ఆర్జీ-2,3 అండ్ ఏపీఏ, భూపాలపల్లి, శ్రీరాంపూర్ మం దమర్రి, బెల్లంపల్లి కొత్తగూడెం రీజియన్ టీంలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఆర్జీ రీజియన్ రక్షణ జీఎం సందనాల సాంబయ్య, రెస్క్యూ మేనేజర్ బింగి మాధవరావు, డీజీఎం(పా) రాజేంద్రప్రసాద్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## సుజాతనగర్‌లో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 7 : సుజాతనగర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైటింగ్‌ను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండల కేంద్రాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వనమా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అసంతృప్తి నేతలకు బుజ్జగింపులు



కాసుల వెంకట్‌తో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 7: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కాసుల వెంకట్, ఆయన సతీమణి, వార్డు కౌన్సిలర్ కాసుల ఉమారాణితో వారి ఇంటి వద్ద రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శనివారం సమావేశమయ్యారు. వెంకట్ దంపతులతో వివిధ అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, ఇటువంటి కీలక సమయంలో పార్టీ నుంచి బయటకు వెళ్లడం ద్వారా రాజకీయ భవితను దెబ్బతీసుకోవద్దని సూచించారు. భవిష్యత్‌లో న్యాయం చేస్తామని వారికి రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర హామీ ఇచ్చారు. పార్టీలోనే కొనసాగుతానని వారితో వెంకట్ దంపతులు చెప్పారు.

## పీఎల్ఆర్ బోనస్ రూ. లక్షకు తగ్గకుండా సాధించాలి

కాసిపేట, అక్టోబర్ 7 : జాతీయ సంఘాలు పీఎల్ఆర్ బోనస్‌ను రూ. లక్ష తగ్గకుండా సాధించుకొని రావాలని టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ తీసి అనంతరం కార్మికులతో కలిసి మేనేజర్ అల్లావుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కోల్ ఇండియా యాజమాన్యంతో జాతీయ సంఘాలు పీఎల్ఆర్ బోనస్‌పై చర్చలు జరుపుతున్నాయన్నారు. వేజ్‌బోర్డ్ విషయంలో విఫలమైన జాతీయ సంఘాలు కనీసం పీఎల్ఆర్ బోనస్‌పైనా లక్షకు తగ్గకుండా ఇప్పించాలని, ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు భైరి శంకర్, జాడి శివ, కార్మికులు పాల్గొన్నారు.

**టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం**

మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గని మేనేజర్ లక్ష్మీ నారాయణకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ గని పిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగులు ఎదురు చూస్తున్న పీఎల్ఆర్ బోనస్‌ను రూ. లక్ష తగ్గకుండా జరగబోయే సమావేశంలో జాతీయ సంఘాలు ఒప్పందం చేసుకొని రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ సెగ్గం శ్రీను, ఓవర్‌మెన్ లింగాల శ్రీనివాస్, కార్మిక్, రాజయ్య, వెంకటేశ్, కృష్ణ మోహన్, సారంగపాణి, స్వామి, ప్రదీప్, పోశం, రమేశ్, అశోక్, ప్రభాకర్, కిరణ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



కాసిపేట : కాసిపేట గనిపై మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

## వీడియో కాన్ఫరెన్స్

యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 7: సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) జీ. వెంకటేశ్వర్ రెడ్డి ఓబీ ఉత్పత్తిపై హైదరాబాద్‌లోని కార్యాలయం నుంచి జీఎంలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గుత్తేదారులకు కేటాయించిన ఓబీ లక్ష్యాలు సాధించేందుక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఓబీ మెటీరియల్ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆర్జీ-2 ఏరియాలో గత నెలలో వర్షాల వల్ల కేటాయించిన ఓబీ తొ లగింపునకు అంతరాయం కలిగిందని, రాను న్న రోజుల్లో లక్ష్యాలకు అనుగుణంగా గుత్తేదారులకు కేటాయించిన ఓబీ తొలగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని జీఎం సూర్యనారాయణ డైరెక్టర్‌కు తెలిపారు. ఈ వీసీలో ఓసీపీ-3 అధికారి మధుసూదన్, సర్వే అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.

## రాంజీగోండ్ విద్యాలయానికి సహకారం

బెల్లంపల్లి, అక్టోబర్ 7: వనవాసీ కల్యాణ పరిషత్ రాంజీగోండ్ విద్యార్థి నిలయానికి సింగరేణి సంస్థ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, సీనియర్ పర్సనల్ అధికారి ఆశీఫ్ శనివారం విద్యార్థి నిలయాన్ని సందర్శించారు. విద్యార్థుల ట్యూషన్ ఫీజు, వ్యవస్థల నిర్వహణకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.మూడు లక్షల చెక్కును కమిటీ అధ్యక్షుడు కొడిప్యాక విద్యాసాగర్‌కు జీఎం అందించారు. వనవాసులను సేవలందిస్తున్న వనవాసి కల్యాణపరిషత్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కమిటీ కార్యదర్శి కాసర్ల తిరుపతి, కోశాధికారి సూరం లక్ష్మీనారాయణ, మహిళా ప్రముఖ్ రాచకొండ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## సింగిల్ విండో గేట్‌పాస్ సిస్టం

జ్యోతినగర్, అక్టోబర్ 7: ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల గేట్‌పాస్ జారీలో కొత్తగా ఎన్టీపీసీ యాజమాన్యం సింగిల్ విండో గేట్‌పాస్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు శనివారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి దవాఖానలో గేట్‌పాస్‌ల జారీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని ఎన్టీపీసీ సీజీఎం కేధార్ రంజన్ పాండు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇక నుంచి ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల గేట్‌పాస్ జారీకి కావాల్సిన హెచ్ఆర్, సేఫ్టీ, మెడికల్, సీఐఎస్ఎఫ్ విభాగాల పనులు ఒకే చోట లభించనున్నాయి.

## ముగిసిన శిక్షణ తరగతులు

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 7: ఎస్అండ్‌పీసీ సిబ్బందికి కార్పొరేట్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో ఇస్తున్న పునఃశ్చరక్షణ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. జీఎం స్టోర్స్ ఎంజీ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. స్టోర్స్ ఆస్తుల సంరక్షణలో ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని, సెక్యూరిటీ సిబ్బంది స్టోర్స్ మెయిన్ గేట్‌లలో విధులు సులభంగా నిర్వహించేందుకు నూతనంగా ఇమేజ్ క్యాప్చరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నామన్నారు. దానివల్ల ఇన్వాయిస్, ఇండెంట్‌ను చెక్ చేసినప్పుడు అందులో ఏ మెటీరియల్ ఉందో తెలుసుకోవడం సులభమవుతుందన్నారు. జీఎం సెక్యూరిటీ బీఆర్ దీక్షితులు మాట్లాడుతూ అధునాతన సాంకేతిక విజ్ఞానంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులను కాపాడాలని కోరారు. ఎస్ఎస్‌వో ఎండీ జాకీర్ హుస్సేన్, ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ కే.సత్యనారాయణ, కార్పొరేట్ జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ రమణ, జమేదార్లు, అన్ని ఏరియాల సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.